క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



కార్యక్రమంలో పాల్గొన్న జెడీస్ రాము

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం డ్రై డే – ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జోన్–5 జెడీస్ రాము మాట్లాడుతూ డెంగ్యూ,మలేరియా,చికున్ గునియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బయాలజిస్టు దాడి సాంబమూర్తి,వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వారంలో ఒక్కసారి డ్రై డే పాటించాలన్నారు. ఇంట్లో నీటి కుండీలపై మూతలు అమర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్,,కాకి పోలిరెడ్డి,సర్వసిద్ధి శ్రీలక్ష్మి యాదవ్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన జేడీ ఫౌండేషన్ సభ్యులు



రోడ్డుపై గుంత కప్పుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో గుంతలను జేడీ ఫౌండేషన్ సభ్యులు పూడ్చారు. ఇటీవల పడిన వర్షాలకు ఈ రోడ్డులో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గమనించి శుక్రవారం శ్రమదానం ద్వారా సమీపంలోని గృహ నిర్మాణ వ్యర్థాలతో గుంతలను పూడ్చారు. వీరు చేపట్టిన పనులను చూసిన ప్రజలు అభినందించారు. కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరించిన శ్రీభరత్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని శుక్రవారం ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, విమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, స్థానికులు అబ్దుల్ బషీర్, శ్రీకాంత్, హరి కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈవోఐలు రద్దు చేయాలని ఆందోళన



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన 46 విభాగాల ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)లను తక్షణమే రద్దు చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈవోఐలకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు నుంచి గాజువాక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదని చెబుతూ మరోపక్క ఉక్కు యాజమాన్యం ప్రకటించిన ఈవోఐలను సమర్థించడం విచిత్రంగా ఉందన్నారు. నగరంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు స్టీల్‌ప్లాంట్‌లోవాస్తవ పరిస్థితులను విన్నవించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల స్టీల్‌ప్లాంట్‌లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి పూర్తి స్థాయిలో ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు సమకూర్చాలని కోరారు. పోరాట కమిటీ ప్రతినిధులు జె. అయోధ్యరామ్, డి. ఆదినారాయణ, రమణమూర్తి, గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, డేవిడ్, యు.రామస్వామి,రావుతదితరులు పాల్గొన్నారు.

‘స్మార్ట్’ కష్టాలు



తప్పులతో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డు

- అస్తవ్యస్తంగా రేషన్ కార్డుల పంపిణీ
- గుట్టలుగా పడేయడంతో వెతుక్కోవడానికి అవస్థలు
- కార్డు ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు తికమక



గోపాలపట్నం-02 సచివాలయంలో స్మార్ట్ కార్డుల కోసం గుమి గూడిన జనం

గోపాలపట్నం:

రేషన్ కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని భావించిన ప్రభుత్వం వాటిని వార్డు సచివాలయాలకు అందజేసింది. అయితే అవి గుట్టలుగా రావడంతో కార్డులు వెతుక్కోవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిరక్ష్యరాస్యులు తిప్పలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఎవరి బాధ వారిదిలా మారింది. చదువుకున్న వారు సైతం గుట్టలో తమ కార్డు ఎక్కడ ఉందో తెలియక తికమక పడుతున్నారు. అలాంటి వారిని బాబు మా కార్డు చూడండి అంటే వారు కసురుకుంటున్నారు. దీంతో వారు సచివాలయ సిబ్బందిని ఆశ్రయిస్తున్నారు. తమ పరిధిలో ఉందో లేదో చూసి ఉంటే బయట వెతుక్కోండి అని సమాధానం ఇస్తున్నారు. మరికొందరిని సమీపంలోని సచివాలయానికి వెళ్లి చెక్ చేసుకోమని చెబుతున్నారు. కొన్ని కార్డుల్లో తప్పులు దొర్లాయి.

క్లారిటీ ఏది?

కాగా చాలా మంది వలస వచ్చిన కుటుంబాలు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో చిరునామా సొంత గ్రామాల్లో ఉన్నప్పటికీ మ్యాపింగ్ ఇక్కడే అయ్యారు. అలాంటి వారి కార్డులు ఎక్కడ ఉన్నాయో సిబ్బంది సైతం క్లారిటీగా చెప్పలేకపోతున్నారు. మరో ఈ నెలాఖరులోగా లబ్ధిదారులు కార్డులు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక్కడ తీసుకోలేని కార్డుదారులకు వచ్చేనెల ఒకటి నుంచి పదో తేదీ వరకు రేషన్ డిపోల్లో అందజేయనున్నారు. అప్పటికీ తీసుకోలేని లబ్ధిదారులకు ఏఎస్వో సర్కిల్ కార్యాలయంలో అందజేస్తారు. వీలైనంతవరకు సచివాలయాల్లోనే కార్డులు తీసేసుకోవాలని అధికారులు కూడా ప్రకటించడంతో కార్డుదారులు సచివాలయాలకు పరుగులు పెడుతున్నారు. తమ రేషన్ డిపోకు సంబంధించిన కార్డులను చూసుకోవడం కోసం మరోపక్క రేషన్ డీలర్లు కూడా సచివాలయాల వద్దే నిరీక్షిస్తున్నారు. అయితే, పలు సచివాలయాల్లో దీనికోసం ఇద్దరు, ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. వేల సంఖ్యలో ఉన్న కార్డులను చూసి వాటిని లబ్ధిదారులకు అందజేయడం వారికి తలకుమించిన పనిగా మారిపోయింది. మరికొన్ని సచివాలయాల్లో సిబ్బంది పంపిణీ చేయకుండా, కార్డులన్నీ ఒకచోట పడేసి లబ్ధిదారులను వెతుక్కోవాలని చెబుతున్నారు. సమస్య ఇక్కడే మొదలవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కార్డులపై అందరూ ఒకేసారి పడిపోతున్నారు. పేరు చూసి ఒకరి కార్డు ఒకరు తీసుకెళ్లిపోతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇంటికి వెళ్లి చూసుకున్న తర్వాత ఆ కార్డు తమది కాదని మళ్లీ సచివాలయాలకు వస్తున్నారు. ప్రతిరోజు ఇదే పరిస్థితి చోటుచేసుకొంటుండటంతో లబ్ధిదారులు తలలు పట్టుకొంటున్నారు.

ఒక్కటి కూడా..

ఇదిలా ఉండగా 65 ఏళ్లు దాటిన కార్డుదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క కార్డు కూడా వారు అందజేయలేదు. వారి కార్డులను కూడా అన్ని కార్డులతో కలిపేసి వెతుక్కోవాలని చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు. ఈనెల ఒకటోతేదీ నుంచి రేషన్ ఇవ్వనుండడంతో ఆలోగా తమ కార్డు తీసుకుందామని ఆశపడుతున్న వృద్ధులకు ఈ పరిస్థితి ఆవేదన కలిగిస్తోంది.

కొత్తకార్డులు నిల్

కాగా, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసినా ఇంకా మంజూరు కాలేదు. కొత్త రేషన్‌కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో గత జూన్, జులై నెలల్లో అత్యధిక మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కొత్త కార్డులు మంజూరు కాలేదు.

ఘనంగా జియ్యాని శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న జియ్యాని మారుతీ, విజయ్

గోపాలపట్నం: మాజీ డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జియ్యాని శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు ఎన్‌ఏడీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. యువజన నాయకుడు జియ్యాని విజయ్, మారుతి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో, శాంతినగర్ పార్క్ జంక్షన్ దరి వినాయక మండపం వద్ద కేక్ కట్ చేశారు.పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వెదుళ్ల శ్రీనివాసరావు, కంచిపాటి వెంకటరమణ, యువకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సతీష్‌రెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి.సతీష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం ఏఈవో తిరుమలేశ్వరరావు అందజేశారు.

ములగాడ రోడ్డుకు మోక్షం ఎప్పుడో!



బురద మయంగా ములగాడ సేవా మార్గం



గుంతలతో శ్రావణ్ షిప్పింగ్ మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ గ్రామం నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం పూర్తిగా ధ్వంసమైంది.ఆ మార్గం అంతా గుంతలు,బురద మయంతో నిండి ఉంది. దీంతో ఆ రోడ్డులు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ఈ మార్గంని గుంతల్లో బురద నీరు చేరింది. దీంతో చిన్న పాటి చెరువును తలపించేలా రోడ్డు మారింది. పలువురు వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాలని రోడ్డు అభివృద్ధి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

జాతీయ యూత్ పార్లమెంట్ పోటీల విజేత ‘కేవీ-2’



ఢిల్లీలో బహుమతులు అందుకుంటున్న విజేతలు

కంచరపాలెం: కేంద్ర ప్రభుత్వ పార్లమెంట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థులకు నిర్వహించిన 35వ జాతీయ యూత్ పార్లమెంట్ పోటీల్లో విజేతలుగా కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కేంద్రీయ విద్యాలయం-2 విద్యార్థులు నిలిచారు. ఢిల్లీలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియం పార్లమెంట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హైదరాబాద్ రీజియన్ తరఫున క్షేత్రస్థాయిలో నిలిచిన విజేతలకు లోక్‌సభ సభ్యులు ప్రశంసాపత్రాలు, మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు, అధ్యాపకుడు రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



కుంభప్రోక్షణలో ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం ఘనంగా జరిపారు. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగంపై చిన్నారి ఆందోళన




ఆందోళన వ్యక్తం చేస్తున్న సాహితి



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన కోటి లింగాలు

మల్కాపురం: పర్యావరణానికి హాని కలిగించే పీవోపీ వినియోగంపై ఓ ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆందోళన వ్యక్తం చేస్తోంది. 59వ వార్డు కొత్త నక్కవానిపాలెం వద్ద స్థానిక లంబోదర ట్రస్ట్ నిర్వాహకులు వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన కోటి శివలింగాలతో భారీ వినాయకుడిని ఏర్పాటు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల అనర్థాలున్నాయని, వినియోగించవద్దని తెలిపిన అధికారులు, నిర్వాహకులు రసాయనాలతో కూడిన కోటి శివలింగాలను వినియోగిస్తుంటే అనుమతులెలా ఇచ్చారని సాహితి అనే చిన్నారి ప్రశ్నిస్తోంది. దేవుని పేరుతో నిర్వాహకులు భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించింది. చెప్పుల స్టాండ్, పార్కింగ్ ఫీజు, వినాయకుడి దర్శనానికి టికెట్, ఎగ్జిబిషన్, స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తుల నుంచి డబ్బులు గుంజుతున్నారని పేర్కొంది. నిర్వాహకుల తీరుపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తానంది. తండ్రి సహకారంతో న్యాయపోరాటం చేయనున్నట్లు తెలిపింది.



పురాతన శివాలయంలో కొలువుదీరిన ఏక దంతుడు

నీ మూర్తికే మా మొదటి ప్రణామం



గోపాలపట్నం నరసింహనగర్‌లో రాధాకృష్ణులుగా..



చదువు విలువను చెబుతున్న విద్యార్థి గణపతి



గొల్లవీధిలో శేష శయన వేంకటేశ్వరుడిగా..

వినాయకా నీ మూర్తికే మా మొదటి ప్రణామం అంటూ ఆది పూజ్యుడు గణపతిని మనసారా అర్చించారు నియోజకవర్గ వాసులు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విభిన్న రూపాల్లో కొలువైన విఘ్నాధిపతికి ప్రత్యేక పూజలు చేశారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో విలక్షణంగా ఏర్పాటు చేసిన సెట్లు అలరిస్తున్నాయి.

- గణేష్‌నగర్ చేపల కాలనీలో స్కూల్ నమూనాతో వేసిన మండపంలో విద్యార్థి వినాయకుడు ఆకట్టుకుంటున్నారు. చదువుపై ఆసక్తి కలిగించేందుకు ఇక్కడి వారు ఈ విధంగా విద్యార్థి వినాయకుడిని ఏర్పాటు చేశారు.
- పురాతన శివాలయంలో వినాయకుడు ఉన్నట్లుగా తీర్చిదిద్దిన మండపం ఆకట్టుకుంటోంది. మర్రి ఊడలతో, విరిగిన గోడలతో ఉన్నట్లుగా మండపాన్ని తీర్చిదిద్దారు.
- గోపాలపట్నం నాగేంద్ర కాలనీ ఖజాన దుకాణం వెనుక భాగంలో రాధా కృష్ణుల రూపంలో గణనాథుడు సతీ సమేతంగా భక్తులకు దర్శనమిస్తున్నారు.
- మల్కాపురం పరిధి గొల్లవీధిలో శేష శయనుడిగా గణపతి కొలువుదీరిన విగ్రహం ఆకట్టుకుంటోంది.

– గోపాలపట్నం/మల్కాపురం

ఆ రెండు స్టేషన్లలో హాల్ట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

అగనంపూడి: దువ్వాడ, సింహాచలం రైల్వేస్టేషన్లను సబర్బన్‌గా పరిగణించి అన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ ప్రతిపాదనలు చేశారు. భువనేశ్వర్‌లో శుక్రవారం తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో దువ్వాడ రైల్వేస్టేషన్, విశాఖ మహానగర స్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. విశాఖ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వంటి నగరాలకు రోజు రాత్రి ప్రయాణం చేసే రైళ్లకు బోర్డుకు ప్రతిపాదనలు చేయాలని, శ్రీకాకుళం నుంచి రాజమండ్రి, కాకినాడకు లోకల్ రైళ్లను (షటిల్ ట్రైన్లను) నడపాలని, నాగపూర్–బిలాస్‌పూర్, విశాఖ దుర్గ్ వందే భారత్‌కు తగిన డిమాండ్ లేనందున విశాఖ నాగపూర్‌కు నేరుగా రైలు నడపాలని కోరారు. వందే భారత్ రైళ్ల కోసం దువ్వాడ, సింహాచలం వద్ద సబర్బన్ హాల్ట్ ఏర్పాటు చేసేలా బోర్డుకు ప్రతిపాదనలు పంపాలని, తిరుపతి– విశాఖ డబల్ డెక్కర్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు సీటింగ్ కోచ్‌లు స్థానంలో 2ఏసీ, 3ఏసీ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేసి ర్యాకులను పెంచాలని ఆయన ప్రతిపాదనలు చేశారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సింహపురి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమార్చన పెద్ద ఎత్తున నిర్వహించారు. మహిళలు విశేషంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన ఆచరించారు. మహిళలందరిని గణపతి మండపం వద్ద వరుసగా ఆశీనుల్ని చేశారు. విఘ్నేశ్వరపూజ, లక్ష్మీసహస్రనామార్చన ఘనంగా నిర్వహించి, విశేషం హారతులందించారు. పసుపు కుంకుమలు, పూజాసామగ్రిని కమిటీ సభ్యులు ఉచితంగా ఏర్పాటు చేశారు.

నందిగామకు అప్పన్న ప్రచార రథం



రథాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటరమణ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఎన్టీఆర్ జిల్లా నందిగామకు శుక్రవారం తరలివెళ్లింది. నందిగామలోని వాసవి మార్కెట్‌లో జరుగుతున్న 43వ గణపతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా అప్పన్న ప్రచార రథాన్ని వారి అభ్యర్థన మేరకు అక్కడికి తరలిస్తున్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి రథం తరలింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.